క్లుప్తంగా

ఏబీవీపీ నగర కమిటీ ఎన్నిక



నూతన నగర కమిటీ సభ్యులు

మొయినాబాద్: ఏబీవీపీ మొయినాబాద్ నగర కమిటీ ఎన్నిక గురువారం మున్సిపల్ కేంద్రంలో జరిగింది. సిద్దార్థ కళాశాలలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చందు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కమిటీ కార్యదర్శిగా బట్టు వినయ్‌కుమార్‌యాదవ్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా నితిన్‌గౌడ్, మహేశ్, సహాయ కార్యదర్శులుగా సంజయ్, సంజయ్‌యాదవ్, ఎస్‌ఎఫ్‌డీ కన్వీనర్‌గా భార్గవ్‌రామ్, ఎస్‌ఎఫ్‌ఎస్ కన్వీనర్‌గా బన్ని, సోషల్ మీడియా కన్వీనర్లుగా చరణ్, హేమంత్, హాస్టర్ కన్వీనర్‌గా దేవేందర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా విజయ్‌కుమార్, శ్రీకాంత్, నర్సింహారెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.

పంటల సాగుపై అవగాహన



కిట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తూరు: జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలో నూతనంగా చదువు పూర్తి చేసుకున్న యువ శాస్త్రవేత్తలకు సీనియర్ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పంటల సాగుల గురించి అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పలువురు రైతుల పొలాల్లో సాగు చేస్తున్న పంటలు, వాటి సస్యరక్షణ, చీడపీడల నివారణతో పాటు పలు అంశాలను వివరించారు. అంతేకాకుండా పంటల సాగుకు ముందు పొలాల్లో పోషకాలు, సారవంతం, ఇతర లోపాలను తెలుసుకోవడానికి చేపట్టే భూసార పరీక్షలను తెలియజేశారు. అనంతరం పలువురు గ్రామస్తులకు శాస్త్రవేత్తలు భూసార పరీక్షలకు సంబంధించిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ డైరెక్టర్ గోపాల్‌లాల్, వెంకటకుమార్, వెంకటేశ్, ఉమేశ్, సత్యారాథోడ్, మండల వ్యవసాయ అధికారి గోపాల్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి

ఎంపీడీఓ సంధ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ సంధ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఓటరు లిస్టును వార్డుల వారీగా పారదర్శకంగా ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల అభివృద్ధికి కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడూ పారిశుధ్య పనులు చేయించాలన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. సమావేశంలో మండల ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

ఎంపీడీఓ బన్సీలాల్



మాట్లాడుతున్న ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్‌రూరల్: మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయం దుకాణాల సముదాయంలోని షాపుల కోసం దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం గడువును పొడిగించడం ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బన్సీలాల్ మాట్లాడుతూ.. ఎంపీడీఓ కార్యాలయం దుకాణాల సముదాయంలోని 1ఏ, 13ఏ, 16ఏ, 17ఏ నంబరు గల దుకాణాలకు సీల్డ్ టెండర్ల ద్వారా నిర్వహించనున్న వేలం గడువును పొడిగించామన్నారు. వేలంలో పాల్గొనేవారు ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి ఎంపీడీఓ, ఎంపీపీ ఫరూఖ్‌నగర్ పేరుపై డిమాండ్ డ్రాఫ్టు చెల్లించి ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 11 రోజున సాయంత్రం 3 గంటల వరకు గడువు ఉందన్నారు. ఈ నెల 12న (మంగళవారం) ఎంపీడీఓ కార్యాలయంలో సీల్డ్ టెండర్లను తెరిచి దుకాణాలను కేటాయించామన్నారు. దుకాణాలను తీసుకోవాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భౌబోయ్

- మండలంలో వీధికుక్కల స్వైరవిహారం
- ప్రతి నిత్యం మూగజీవాలు, మనుషులపై దాడులు
- బయటకు రావాలంటేనే జంకుతున్న ప్రజలు
- నియంత్రణపై దృష్టి సారించని మున్సిపల్ అధికారులు



నందిగామలో స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కలు

నందిగామ: వీధికుక్కలు రోడ్లపై స్వైర విహారం చేస్తున్నాయి.. కంటికి కనపడిన మూగజీవాలను వేటాడుతున్నాయి. ఫలితంగా మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా రోడ్లపై వెళ్లే వాహనదారులు, రైతులను వెంబడించడంతో వారు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నారులను బయటకు పంపించాలంటేనే జంకుతున్నారు. మండల కేంద్రమైన నందిగామతో పాటు పలు గ్రామాల్లో వీధి కుక్కలతో ఏదో ఒకచోట ప్రమాదాలు చోటు చేసుకోవడం నిత్యకృత్యంగా మారింది. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పశువులపై దాడి చేసి చంపేయడం, కోళ్ల ఫారాలపై, గొర్రెలు, మేకల మందలపై దాడి చేసిన ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. పట్టించుకోవాల్సి అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మండలంలో చోటుచేసుకున్న ఘటనలు

- రంగాపూర్‌లో మల్లేశ్‌కు చెందిన నాటు కోళ్ల ఫారంపై జూన్ 5న వీధి కుక్కలు దాడి చేసి సుమారు 250 నాటు కోళ్లను కొరికేశాయి.
- ఇటీవల నందిగామకు చెందిన బాలయ్యకు చెందిన గొర్రెల మందపై దాడి చేసి 10 గొర్రెలను చంపేశాయి. మరికొన్ని గొర్రెలు తీవ్ర గాయాలకు గురయ్యాయి.
- గతంలో నందిగామకు చెందిన ఓ బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి.
- ఇటీవల వెంకమ్మగూడకు చెందిన ఓ రైతు లేగదూడను చంపేశాయి.
- వీర్లపల్లికి చెందిన ఓ రైతు మేకలపై దాడి చేసి కొరికేశాయి.

మండలంలో వీధి కుక్కలు ఇలా రెచ్చిపోతున్నా కూడా సంబంధిత అధికారులు వాటిని నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఎక్కడి నుంచి వస్తున్నాయంటే..

హైదరాబాద్, పరిసర ప్రాంతాల నుంచి రాత్రి వేళలో వాహనాల్లో కుక్కలను తీసుకొచ్చి శివారు ప్రాంతమైన నందిగామ పరిసర ప్రాంతాల్లో వదిలి వెళ్తున్నారు. దీంతో ఆ కుక్కలకు ఈ ప్రాంతం కొత్తగా ఉండటం, వాటికి సరైన ఆహారం లభ్యం కాకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ తిరుగుతూ కంటికి కనపడిన మూగజీవాలపై విరుచుకుపడుతున్నాయి. అంతే కాకుండా గ్రామాలలో ఎక్కడ పడితే అక్కడ వేస్తున్న పాడైపోయిన ఆహార పదార్థాల కోసం తిరుగుతున్నాయి. గ్రామాల పరిసర ప్రాంతాల్లో డంపింగ్ యార్డులను అడ్డాలుగా చేసుకుంటున్నాయి. వీటితో పాటు పాత జాతీయ రహదారిపై చికెన్ వ్యర్థాలను ప్లాస్టిక్ సంచులలో ఎక్కడ పడితే అక్కడ వేస్తుండటంతో వాటికి అలవాటు పడి రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు, పాదచారులపై సైతం దాడులకు దిగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కలపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నందిగామలో కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు(ఫైల్)

వీధి కుక్కలను నియంత్రించాలి



గ్రామాల్లో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు వీధి కుక్కలు తిరుగుతున్నాయి. దీంతో పిల్లలను ఇంటి నుంచి బయటకు పంపాలంటేనే భయమేస్తోంది. జూన్‌లో మా నాటు కోళ్ల ఫారంపై దాడి చేయడంతో సుమారు రూ.2లక్షల 50 వేల నష్టం వాటిల్లింది. శునకాలను నియంత్రించాల్సిన అవసరం ఉంది.

– మల్లేష్, రంగాపూర్

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కల బెడద విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. మండల ప్రజలు సైతం పాడైపోయిన ఆహార పదార్థాలను, చెత్త చెదారాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త వాహనంలోనే వేయాలి.

– తేజ్‌సింగ్, ఎంపీఓ

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి



సంఘం జెండాను ఎగురవేస్తున్న రఘునందన్‌రెడ్డి

శంకర్‌పల్లి: రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం టీయూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శంకర్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై.. సంఘం జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక ఉపాధ్యాయ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిలో ఉపాధ్యాయ బదిలీలు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం, డీఏల పెంపు, 317 జీఓ బాధిత ఉపాధ్యాయులకు న్యాయం, యూఆర్‌ఎస్, సమగ్ర శిక్ష, కాంట్రాక్టు ఉపాధ్యాయులకు కనీస వేతన పెంపు తదితర అంశాలు ఉన్నాయని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేపడుతామన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి, షాబాద్ మండల అధ్యక్షులు అంజయ్య, మొగులయ్య, శంకర్‌పల్లి, షాబాద్ కార్యదర్శులు శ్రీనివాస్, రాము, నాయకులు నారాయణ, సుదర్శన్, దయానందం, భారతి, వీరమణి పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయండి

ఎంపీడీఓ వెంకయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: మండలంలో ఈ నెల 11 నుంచి 15 వరకు నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల వైద్యాధికారి రేవతిరెడ్డి, విద్యాధికారి అక్బర్, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వన మహోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, దీనిలో ప్రతి ఒక్కరూ పాల్గొని, విజయవంతం చేయాలని సూచించారు. మొదటగా గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాలను గుర్తించి, దానికి అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలన్నారు. అదేవిధంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. షాద్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తున్నారన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఫరూఖ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తామని చెప్పి కూల్చివేసింది బీఆర్‌ఎస్ నేతలు కాదా అని ప్రశ్నించారు. పట్టణంలో రూ.29కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతుంటే బీఆర్‌ఎస్ నేతలకు కడుపుమండుతుందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పదేళ్ల కాలం అభివృద్ధి కేవలం కాగితాలకే పరిమితమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు షర్ఫోద్దీన్, నీరటి వాసు, యాదగిరియాదవ్, రాజేందర్‌రెడ్డి, అందె మోహన్, ముబారక్ పాల్గొన్నారు.

హామీలను గాలికి వదిలేసిన ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు

చేవెళ్ల: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని గాలికి వదిలేసి పాలన చేస్తోందని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో పలువురు మండల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. స్థానిక ఎన్నికలను నిర్వహించకుండా బీసీల కోసం అంటూ కొత్త రాగం ఎత్తుకొని కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి ప్రజలు, అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఏడాదిన్నర కాలంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గానికి దాదాపు 3 కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారన్నారు. ఈ ప్రభుత్వం కాని, ఎమ్మెల్యే ఈ నియోజకవర్గంలో 10 ఏళ్లకుపైగా పనిచేసి.. చేసిన అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. అభివృద్ధి కోసమే పార్టీలు మారుతున్నానని.. అధికారం ఉన్న పార్టీలోకి మారి చేసింది ఏమిటో చూపించాలని డిమాండ్ చేశారు. ఎవరు స్వార్థం కోసం పార్టీలు మారి ఏమి చేస్తున్నారోనని ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. చేవెళ్లలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, మొయినాబాద్‌లో జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, నాయకులు వెంకటరెడ్డి వైభవ్‌రెడ్డి, అనంత్‌రెడ్డి ఉన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ నిఖిత

కేశంపేట: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ఆశకార్యకర్తలు, ఉపాధ్యాయులకు నులిపురుగుల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి నిఖిత మాట్లాడుతూ.. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు పిల్లల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని సూచించారు. నులిపురుగులు మానవుల పేగుల నుంచి పోషకాలను గ్రహించి.. అభివృద్ధి చెంది పరాన్నజీవులుగా మారుతాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం, అపరిశుభ్రత ప్రదేశాల్లో నివాసించడంతో నులిపురుగులు సంక్రమిస్తాయన్నారు. నులిపురుగుల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, ఎంపీహెచ్‌ఈఓ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు ఏపీఎం ఎవరు?

వచ్చిన రెండు రోజులకే మరో చోటకు బదిలీ



బదిలీపై వచ్చిన యాదమ్మకు స్వాగతం పలికిన మండల సమాఖ్య సిబ్బంది(ఫైల్)

కొందుర్గు: ఇదివరకు కొందుర్గు మండల మహిళా సమాఖ్యలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న జయమాలిని జూలై 31న ఫరూఖ్‌నగర్ బదిలీపై వెళ్లారు. అదే సమయంలో నల్గొండ జిల్లా కేతెపల్లి ఏపీఎంగా పనిచేస్తున్న యాదమ్మ కొందుర్గు ఏపీఎంగా బదిలీపై వచ్చారు. ఆమె ఈ నెల 1న కొందుర్గు ఏపీఎంగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కొందుర్గు మండల మహిళా సమాఖ్య సిబ్బంది యాదమ్మకు ఘనంగా స్వాగతం పలికారు. కాగా ఆమె గురువారం కొందుర్గు నుంచి మేడ్చల్ బదిలీపై వెళ్లారు. దీంతో కొందుర్గు ఏపీఎం ఎవరూ అని ప్రశ్నార్థకంగా మారింది. బదిలీపై వచ్చిన నాలుగు రోజులకే తిరిగి వెళ్లడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా



ఎన్నికల్లో పాల్గొన్న విద్యార్థులు

షాద్‌నగర్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా అన్నారు. గురువారం పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో స్కూల్ లీడర్ ఎలక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్‌గర్ల్స్‌గా దీక్షిత, దీపిక, సహస్ర, శ్రేష్ఠ, హెడ్‌బాయ్స్‌గా అభిరామ్, అఖిల్, హర్షిత్, దూబే, గౌతమ్‌రెడ్డి ఎన్నికల్లో పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష ఓటింగ్ విధానం ద్వారా హెడ్‌గర్ల్‌గా దీక్షిత, హెడ్‌బాయ్‌గా గౌతమ్‌రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో మంచి నాయకుడిగా ఎదగాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి చదువుల్లో రాణించాలన్నారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పేరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, రఫీ, ఇమ్రాన్, సుజాత, మీన, సునీత తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నముక

మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి



బీఆర్‌ఎస్ నాయకుడు ధన్‌పాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న సబితారెడ్డి, నాయకులు

మొయినాబాద్‌రూరల్: పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలను ఎన్నడు మరిచిపోలేరని, అలాంటి నాయకుడు కష్టకాలంలో ఉన్నప్పుడు పరామర్శించడం ధర్మం అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కాశీంబౌలి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ మంత్రి ఇంద్రారెడ్డి వీరాభిమాని మాడి ధన్‌పాల్‌రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా బుధవారం సబితారెడ్డి పలువురు నాయకులతో కలిసి ధనపాల్‌రెడ్డిని పరామర్శించి ధైర్యాన్ని నింపారు. అదేవిధంగా కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. నాణ్యమైన వైద్యం అందించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇటమోని లక్ష్మమ్మ గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించడంతో బాధితురాలి కుటుంబ సభ్యులు ఆర్థికసాయం అందించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డిని ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ.2లక్షల విలువచేసే ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ ఎల్‌ఓసీ పత్రాన్ని పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, యారం శేఖర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, దినేశ్‌సాగర్, మల్లేశ్, నరేందర్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు.. బిడ్డలకు మేలు

అంగన్‌వాడీ టీచర్ మహేశ్వరీ

షాద్‌నగర్: పుట్టిన బిడ్డలకు ఆరునెలల పాటు విధిగా తల్లిపాలు తాగించాలని, దీంతో తల్లీబిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ టీచర్ మహేశ్వరీ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొంగగూడ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాలపై మహిళలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పుట్టిన వెంటనే శిశువులకు ముర్రుపాలు తాగించాలని సూచించారు. తల్లిపాలతో బిడ్డలకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. బిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు టీకాగా పనిచేస్తాయన్నారు. బాలింతలు చిన్నారులకు విధిగా ఆరునెలల పాటు పాలు తాగించాలని, దీంతో తల్లులకు రొమ్ము కేన్సర్, అండాశయ కేన్సర్ల వంటి వ్యాధులు దరి చేరవన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిరా, విజయ, భారతీ, ప్రమీల, లక్ష్మీ, అలివేలు, సాలి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు ఆరోగ్యం

కొందుర్గు: పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టాలని, తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం మహదేవ్‌పూర్, ముట్పూర్, బైరంపల్లి, ఉత్తరాసిపల్లి, టేకులపల్లి గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలలో రోగనిరోధకశక్తి ఉంటుందని, శిశువులకు పోతపాలు పట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శారద, వినోద, అనురాధ, భారతి, పార్వతమ్మ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

మొయినాబాద్‌రూరల్: గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులు పోషకాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ల మండల కార్యదర్శి కవిత అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ అంగన్‌వాడీ–2 కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలు శిశువుకు ఆరోగ్యకరమైనవన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ద్వారా అందించే పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు లక్ష్మి, శివరాణి, విజయ, భాస్కర ఆస్పత్రి సిబ్బంది, బాలింతలు, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.



షాద్‌నగర్: బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



కొందుర్గు: ఉత్తరాసిపల్లిలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జ్యోత్స్న



మొయినాబాద్‌రూరల్: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న టీచర్లు, భాస్కర ఆస్పత్రి సిబ్బంది